సాక్షి
మహబూబ్‌నగర్
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ఏది అసలు.. ఏది నకిలీ?

బాదేపల్లి ప్రస్తుతం కల్తీ సరుకులకు నిలయంగా మారుతోంది.

వివరాలు 8లో ▸



గండ్లు పూడ్చరా?

గొలుసు కట్టు చెరువుల ఎర్రకాల్వ మరమ్మతుకు నోచుకోవడం లేదు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.6 /18.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం స్వల్పంగా గాలులు వీస్తాయి. పగటి పూట ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలి



పాలమూరు: రాష్ట్రంలో వరుసగా న్యాయవాదుల హత్యలు, దాడులు జరగడం శోచనీయమని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న సురేందర్‌పై దాడిచేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర న్యాయవాదుల ఫెడరేషన్ పిలుపుమేరకు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ముఖద్వారం ఎదుట న్యాయవాదులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని చాలా రోజులుగా డిమాండ్ చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జాకీర్, ఆవెజ్, కృష్ణ, తగిలి కృష్ణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ప్రభుత్వ ఎన్టీయార్ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టును బోధించేందుకు గాను ఒక గెస్ట్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్జెక్టులో పీజీతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 23, 24వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రెండో రోజు ఇంటర్వ్యూ, డెమో నిర్వహిస్తామని తెలిపారు.

25న జెడ్పీ సర్వసభ్య సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 25వ తేదీన స్థానిక జెడ్పీ మీటింగ్‌హాల్‌లో జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన సిద్ధం చేసిన ఎజెండా జెడ్పీటీసీ సభ్యులకు పంపించినట్లు పేర్కొన్నారు. అధికారులందరూ హాజరు కావాలని, సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

28న ఇంటర్వ్యూ

పాలమూరు: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఎన్‌హెచ్‌ఎం పథకం విభాగంలో పని చేయడానికి ఒక ఫిజియోథెరపిస్ట్ పోస్టు భర్తీ చేస్తున్నామని దీనికోసం ఈనెల 28న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30వరకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

4లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి: డీఈఓ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 2022-23 విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ చదువుతున్న పదోతరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు పరీక్ష ఫీజును వచ్చే నెల 4వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ యాదయ్య ఒక ప్రకటనలో కోరారు. పదోతరగతి వారు అపరాధ రుసుముతో కలిపి తత్కాల్ ఫీజు కింద రూ.500, ఇంటర్ విద్యార్థులు రూ.వేయి మీ-సేవ ద్వారా టీఎస్ ఆన్‌లైన్‌లో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,960



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకి గరిష్ఠంగా రూ.7,960, కనిష్ఠంగా రూ.4,065 ధరలు లభించాయి. అదేవిధంగా పత్తికి గరిష్ఠంగా రూ.7,660, కనిష్ఠంగా రూ.5,099, కందులు రూ.7,469, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.6,010, కనిష్ఠంగా రూ.5,489 ధరలు లభించాయి.

తెల్లకందులు క్వింటాల్ రూ.8,069

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం తెల్లకందులు క్వింటాల్ గరిష్ఠంగా రూ.8,069, కనిష్ఠంగా రూ.8,009 పలికాయి. ఎర్ర కందులు రూ.7,919, రూ.7,670, జొన్నలు రూ.5,021, వేరుశనగ రూ.7421, రూ.3,500, శనగలు రూ.4,739, తెల్లకుసుమలు రూ.4,406 పలికాయి. జిల్లాలోని కాటన్ మిల్లుల్లో పత్తి క్వింటా గరిష్ఠంగా రూ.7,800, కనిష్ఠంగా రూ.4,500 పలికింది.

భౌ..భౌ.. బాబోయ్!

వీధి కుక్కల స్వైర విహారం

- పట్టణ ప్రజలను దడ పుట్టిస్తున్న గ్రామసింహాలు
- పురపాలికల్లో కుక్కల బెడదపై 'సాక్షి' ఫోకస్
- వాకింగ్‌కు వెళ్లాలంటేనే జంకుతున్న వైనం



జిల్లాలోని ఏ వీధిలో చూసినా, ఏ రోడ్డుపై చూసినా.. వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. గుంపులు.. గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి. మూగజీవాలపైనే కాకుండా మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. వాహనదారులను వెంబడిస్తున్నాయి. పాదచారులను పరుగులు పెట్టిస్తున్నాయి. దీంతో పిల్లల నుంచి పెద్దల వరకు బయటికి రావాలంటే బెదిరిపోతున్నారు.

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ జడ్చర్లటౌన్/ భూత్పూర్

పురపాలికల్లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఏ కాలనీలో చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళ వాకింగ్‌కు వెళ్లాలంటేనే జంకుతున్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 49వార్డుల్లో సుమారు 4,250 వీధికుక్కలు ఉన్నాయి. ఇందులో హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎనుగొండ, శ్రీనివాసకాలనీ, రామకృష్ణకాలనీ, ఇండస్ట్రియల్ ఏరియా, పిల్లలమర్రి రోడ్డు, ఎర్రసత్యం కాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం వెనుకభాగంలో, మర్లు, కొత్తచెరువు రోడ్డు, కొత్తగంజి, హనుమాన్‌నగర్, మోతీనగర్, మధురానగర్, తిమ్మసానిపల్లి రైల్వేగేట్, దొడ్డలోనిపల్లి, ఫైర్‌స్టేషన్, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్, లారీ అసోసియేషన్ భవనం, చిన్నదర్పల్లి చౌరస్తా ప్రాంతాల్లో వీధికుక్కలు భౌ..భౌ..మంటూ పాదచారులు, వాహనదారులను వెంబడిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో గ్రామసింహాలు చుక్కలు చూపిస్తున్నాయి. వాహనాల వెంట తరుముతున్నాయని, వాటి బారినుంచి తప్పించుకొని ఇళ్లకు వెళ్లేందుకు నానా కష్టాలు పడాల్సి వస్తోందని పలువురు పట్టణవాసులు వాపోతున్నారు.

టీకా ఇచ్చి వదిలివేస్తున్న అధికారులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏడాది క్రితమే ఒకటో వార్డులోని మౌలాలిగుట్ట ప్రాంతంలో జంతువుల సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గతేడాది ఏప్రిల్ నుంచి గత నెల జనవరి వరకు పది నెలల్లో 2,795 వీధికుక్కలను పట్టుకుని ఈ కేంద్రానికి తరలించారు. నవంబర్‌లో 373, డిసెంబర్‌లో 277, గత నెల జనవరిలో 252 వీధికుక్కలు పట్టుకుని కుటుంబనియంత్రణతో పాటు వ్యాక్సిన్ (యాంటీ రేబిస్ టీకా) వేయించామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. ప్రతి రోజూ పది నుంచి 12 వీధి కుక్కలను పట్టుకుంటున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ఐదుగురు సిబ్బంది ఉంటారు. అనంతరం వాటిని కనీసం వారం రోజుల పాటు అందులోనే ఉంచి కుటుంబ నియంత్రణ చేయించారు. ఎవరినైనా కరిచినప్పుడు రేబిస్ వ్యాధి సోకకుండా వాటికి ముందుగానే టీకాలు సైతం ఇచ్చి తిరిగి ఆయా వీధుల్లోనే వదిలివేశారు. దీంతో సమస్య మొదటికి వచ్చింది. ఈ క్రమంలోనే వీధి కుక్కలు పాదచారుల వెంట పడి పరుగులు పెట్టిస్తున్నాయి. ఇక చిన్నారులు కనిపిస్తే చాలు మూకుమ్మడిగా దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇదిలాఉండగా వ్యాక్సిన్ వేసిన వీధి కుక్కలు ఒకవేళ కరిచినా మనుషులకు ఏ ప్రమాదం ఉండబోదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.మధుగౌడ్ తెలిపారు.

- కుక్కల నిర్వహణ బాధ్యతను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఒక్కో కుక్క వ్యాక్సినేషన్, కు.ని., తదితర నిర్వహణ కోసం రూ.1,500 ఇస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 2,795 కుక్కలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశారు.



మర్లులోని ఓ వీధిలో కుక్కల గుంపు

- జడ్చర్ల పట్టణంలోని పాత బజార్ మటన్ మార్కెట్, నిమ్మబావిగడ్డ, ఇందిరానగర్, గాంధీనగర్, విద్యానగర్, తాలూకా క్లబ్ ప్రాంతాలతో పాటు కల్వకుర్తి రోడ్‌లోనూ కుక్కల బెడద అధికంగా ఉంది. కావేరమ్మపేట, హౌసింగ్‌బోర్డు.. ఇలా ఏ కాలనీకి వెళ్లినా కుక్కల భయం వెంటాడుతూనే ఉంది. నాలుగేళ్ల క్రితం వరకు కుక్కలను పట్టించి, వాటిని అటవీప్రాంతంలో వదిలిపెట్టించేవారు. రెండేళ్ల క్రితం సమస్య కొంత తగ్గినట్లనిపించినా ఈ మధ్య మళ్లీ బెడద పెరుగుతుంది. గతంలో ఓ పిచ్చికుక్క పాతబజార్‌లో స్వైరవిహారం చేసి పదుల సంఖ్యలో క్షతగాత్రులను చేసింది. శాంతినగర్ ప్రాంతంలో ఓ కుక్క చిన్నారిపై దాడి చేసింది. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి నెల పదిమంది బాధితులు ఉంటున్నారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో 2,850 కుక్కలు ఉన్నాయి. అయితే 167వ నంబర్ జాతీయరహదారిపై కల్వకుర్తి మార్గంలో హరినివాస్ దాటిన తరువాత రోడ్డుకిరువైపులా చెత్తను పారవేస్తుండటంతో, మాంసం విక్రయదారులు వ్యర్థాలను అక్కడే వేస్తుండడంతో కుక్కల సంచారం పెరిగింది. దీంతో రాత్రిళ్లు వాహనదారులు అటువైపు వెళ్లేందుకే జంకుతున్నారు.

- భూత్పూర్ మున్సిపాలిటీలోని భూత్పూర్, అమిస్తాపూర్‌లో చికెన్ సెంటర్లు ఎక్కువగా ఉండడంతో కుక్కల బెడద పెరిగింది. గతేడాది కాలంలో 404 మంది కుక్కకాటు బాధితులు ఉన్నారు. భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి నెల 20 మందికి మించకుండా బాధితులు ఉంటారు. ఆస్పత్రిలో రెబీస్ టీకా కొరత లేదని, కుక్కకాటు తీవ్రతను బట్టి 3, 7, 14, 28 రోజుల పాటు వైద్యం నిర్వహించాల్సి ఉంటుందని సీహెచ్ఓ రామయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 2వేల కుక్కలు ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు.



జిల్లా కేంద్రంలో కుక్కలను పట్టుకుంటున్న కాంట్రాక్ట్ సిబ్బంది

20 మందిని కరిచాయి



మా వార్డులో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వందకు పైగానే ఉంటాయి. నెల రోజుల క్రితం మా వీధిలో వెళ్తున్న వారిని ఐదారు కుక్కలు వెంబడించాయి. ఏకంగా 20 మందిని కరవడంతో గాయాలయ్యాయి. ఉదయం, సాయంత్రం వాకింగ్ కోసం బయటకు రావాలంటేనే భయంగా ఉంది. చిన్నపిల్లలను ఆడుకోవడానికి బయ టకు పంపలేకున్నాం. మున్సిపాలిటీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– స్వర్ణలత, రామకృష్ణకాలనీ, ఐదో వార్డు, మహబూబ్‌నగర్

కు.ని.తో పాటు వ్యాక్సిన్ వేయిస్తున్నాం



పట్టణంలోని వీధికుక్కలను ఎప్పటికప్పుడు పట్టుకుని మౌలాలి గుట్ట ప్రాంతంలోని సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నాం. అక్కడ వాటికి కు.ని.తో పాటు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయిస్తున్నాం. ఎవరైనా ఫిర్యాదు చేసిన వెంటనే ప్రత్యేక బృందం సంఘటన స్థలానికి చేరుకుని వాటిని వాహనంలో తీసుకుని వెళతారు. వారం రోజుల తర్వాత తిరిగి వదిలివేస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

రెండు మూడు రాత్రుళ్లు జాగారం చేశాం



వీధి కుక్కల బెడద వల్ల రెండు, మూడు రోజులు రాత్రిళ్లు జాగరణ చేసి ఇంట్లోకి రాకుండా కాపలా కాశాం. ఏకంగా ప్రహరీ దూకి ఇంట్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుంటాయి. కొన్ని రోజులుగా కుక్కల సంఖ్య బాగా పెరిగింది. 10 నుంచి 15 కుక్కలు గుంపులుగా తిరుగుతుంటే మాకే భయం వేస్తుంది. పిల్లలను అసలు బయటకే వదలం. రాత్రిళ్లు ఆఫీసుల నుంచి వచ్చేవారైతే కుక్కలంటేనే హడలిపోతుంటారు.

–శ్రీను, విద్యానగర్, జడ్చర్ల మున్సిపాలిటీ

ఇంటికెళ్తుంటే పైకి వస్తున్నాయి



పోలేపల్లి ఫార్మా కంపెనీలో పనిచేసి రాత్రి 2 గంటలకు బస్సు దిగి తాలూకా క్లబ్ రోడ్‌లో నివాసం ఉండే ఇంటికి వెళ్తుంటే కుక్కల భయం వెంటాడుతోంది. ఎక్కడినుంచి వస్తాయో తెలియదు పైకి దూసుకొస్తున్నాయి. ఇంటికి చేరుకునే వరకు ప్రాణాలు అరచేతిలో పెట్టు కుని వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం మా పరిస్థితి ఇదే.

– అశోక్‌కుమార్, ఫార్మా ఉద్యోగి, జడ్చర్ల

అన్ని చర్యలు చేపడతాం



సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని కుక్కలను పట్టు కుని మహబూబ్‌నగర్‌లో జంతు సంరక్షణ కేంద్రంలో కుటుంబ నియంత్రణ టీకాలు వేయించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. కౌన్సిల్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ లాంటి ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపడతాం.

–మహమూద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

'సాక్షి' కథనంపై కదలిక

సాక్షి ఎఫెక్ట్..

- వ్యభిచార గృహాలపై పోలీసుల నిఘా

గద్వాల క్రైం: మామూళ్లు పుచ్చుకొని వ్యభిచారదందాను చూసీచూడనట్లు వ్యవహరించారనే కొందరు పోలీసుల భాగోతంపై ఉన్నతాధికారులు ఆరా తీయడంతో పాటు నివేదిక కోరినట్లు తెలిసింది. జిల్లాకేంద్రంలో వ్యభిచారదందాకు సహకారం అందించారనే విషయంపై 'ఎవరా ఖాకీలు' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమవగా.. ఆ పోలీసులు ఎవరనే చర్చ హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు రాష్ట్ర ఇంటెలిజెన్స్, ప్రత్యేక విభాగ సిబ్బంది జిల్లా అధికారులతో ఈ విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. వ్యభిచార దందాకు సహకరించడంలో నేతల ఒత్తిళ్లు ఉన్నాయా, ఎవరానేతలు తదితర అంశాలపై వీలైనంత త్వరగా విచారణ చేపట్టి నివేదికలు అందజేయాల్సిందిగా ఎస్పీ సృజనను కోరినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, 2021 జూన్ 6వ తేదీన సాయి హోంకాలనీలోని కొంతమంది విటులు, అమ్మాయిలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన అప్పటి స్టేషన్ అధికారి, సర్కిల్ సీఐ ఎవరనే అంశాలపై ఆరా తీయాల్సిందిగా ఎస్పీకి ఆదేశాలు వచ్చాయని సమాచారం. అలాగే, ఈ నెల 19వ తేదీన భీంనగర్ కాలనీలో వ్యభిచార నిర్వాహకురాలు, ఓ మహిళను మాత్రమే పోలీసులు అదుపులోకి తీసుకోవడం, విటులు ఎవరూ లేకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. విటులు లేని క్రమంలో ఆ ఇద్దరు మహిళలే పడుపు వృత్తిలో ఉన్నారా.. లేక విటులను తప్పించారా.. ఆ తర్వాతే కేసు నమోదు చేశారంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వందశాతం గ్రౌండింగ్ చేయాలి

- ఎప్పటికప్పుడు దళితబంధు యూనిట్ల తనిఖీ
- 'ఉపాధి హామీ'లో ఎక్కువ మంది కూలీలను నమోదు చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మంజూరైన దళితబంధు యూనిట్లన్నీ వందశాతం గ్రౌండింగ్ కావాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. బుధవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. దళితబంధు కింద జిల్లాలో 316 యూనిట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 308 గ్రౌండ్ అయ్యాయని, మిగిలిన యూనిట్లు సైతం వెంటనే గ్రౌండ్ చేయాలని ఆదేశించారు. మంజూరైన దళితబంధు యూనిట్లను ఎంపీడీఓలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని చెప్పారు. విజయవంతంగా నడుస్తున్న యూనిట్లపై మండలానికి 2 చొప్పున విజయగాథలను వారంలోగా సమర్పించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ మంది కూలీలు నమోదయ్యేలా చూడాలని, ఇప్పుడు ఎలాంటి వ్యవసాయ సీజన్ లేనందున ప్రతి గ్రామంలో కనీసం 50 మంది కూలీలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల వారీగా పని చేస్తున్న కూలీలు, వారి వివరాలను తెలుసుకోవడంతో పాటు తక్కువ కూలీలు వస్తున్న గ్రామాలపై ఎక్కువ దృష్టి సారించి వారంలో రెండుసార్లు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, సీసీలతో సమీక్షించాలని ఎంపీడీఓలను ఆదేశించారు.

- జిల్లాలో ఇప్పటివరకు 335 గ్రామీణ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారని, మిగిలిన 330 గ్రామాల్లో కామన్ ఏరియా, పబ్లిక్ స్థలాలు, హైస్కూల్, పీహెచ్‌సీ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం ఎక్కడైనా వీటిని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు పూర్తిగా వినియోగంలో ఉండేలా చూ డాలని, వాటికి సంబంధించి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్‌పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు, బతికిన మొక్కలతో పాటు రానున్న సంవత్సరం నాటను న్న మొక్కలకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, మొక్కలు ఎండిపోకుండా సంరక్షించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యాదయ్యగౌడ్, డీఆర్‌డీఓ యాదయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఉపాధి' సామాజిక తనిఖీ

జిల్లాలో జరిగిన ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ తెలిపారు. బుధవారం పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అక్రమాలకు సంబంధించి రికవరీతో పాటు, బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. స్త్రీనిధి కింద రికవరీ చేసే రుణాల శాతాన్ని పెంచుతామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా అమలు చేయాలని, నియమావళి అమలు, తుది ఓటరు జాబితా, బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ నివేదికలు సకాలంలో పంపించడంపై జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆయన కలెక్టర్లతో వీసీలో మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే బ్యాలెట్ పత్రాలకు సంబంధించి వెరిఫికేషన్ రిపోర్ట్ పంపించాలన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఓటర్లుగా నమోదైన ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేస్తామని వివరించారు. వీసీలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీఓ అనిల్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షణాధికారి అఖిల ప్రసన్న, డీటీ జాఫర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అండగా ఉండాలి



అడ్డాకుల పెద్ద చెరువులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధిపొందే వారు తప్పకుండా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. అడ్డాకుల పెద్ద చెరువుకు ఘనపురం బ్రాంచ్‌కెనాల్ ద్వారా కేఎల్ఐ నీళ్లు రావడంతో బుధవారం కృష్ణా జలాలకు చెరువులో పూజలు చేసి పూలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాకముందు కాంగ్రెసోళ్లు అధికారంలో ఉండి మా లాగా నీళ్లు తేవాలన్న ఆలోచన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు రైతులను పట్టించుకోలేదని, తెలంగాణ వచ్చిన తర్వాతే రైతులపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించి రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంటును అందజేస్తున్నారని చెప్పారు. నిరంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు చెప్పే అబద్ధాలను నమ్మకుండా అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని, మనందరం సీఎంకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు మనరాష్ట్రంలో అమలవుతున్నందున రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. అనంతరం కల్వకుర్తి ఎత్తిపోతల జలాలు అడ్డాకుల పెద్ద చెరువుకు రావడంలో కీలకంగా పనిచేసిన డీఈలు నరేందర్‌రెడ్డి, సత్యనారాయణలను ఎమ్మెల్యే ఆల ఘనంగా సత్కరించి రైతుల తరపున అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బాద్మి శివకుమార్, జెడ్పీటీసీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచ్ శ్రీకాంత్, ఎంపీటీసీలు రంగన్నగౌడ్, గణేష్, చంద్రయ్య, నాయకులు భీమన్నయాదవ్, ఖాజాఖోరీ, చంద్రమోహన్‌రెడ్డి, రమేష్, మహేష్ ఉన్నారు.

జిల్లా కోర్టులో కంటి వెలుగు కార్యక్రమం



న్యాయమూర్తికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పాలమూరు: కంటి సమస్యలు లేకుంటేనే విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేస్తామని జిల్లా అదనపు న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కోర్టులో పనిచేసే అన్ని రకాల ఉద్యోగస్తులు, న్యాయవాదులు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కోర్టులో 181మందికి కంటి పరీక్షలు చేయగా 60మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా మరో 66 మందికి దూరపు చూపు సమస్య ఉంటే అద్దాలు ఆర్డర్ పెట్టారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు నీరజ, వై.పద్మ, సంధ్యారాణి, శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్, డాక్టర్ రఫీక్, మాస్‌మీడియా అధికారి తిరుపతిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి పాల్గొన్నారు.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 45 వైద్య బృందాలు కంటి వెలుగు కార్యక్రమం కింద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. బుధవారం 6,118 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 1,436 మందికి అంధత్వ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 797 మందికి అక్కడే అద్దాలు పంపిణీ చేయగా మరో 639 మందికి దూరపు చూపు సమస్య ఉండటం వల్ల వారికి అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. జిల్లాలో ఇప్పటివరకు 1,67,723 మందికి కంటి పరీక్షలు చేయగా 39,942 మందికి అంధత్వ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 24,688 మందికి అద్దాలు పంపిణీ చేయగా మరో 15,254 మందికి దూరపు చూపు అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు.

క్లుప్తంగా

చికిత్స కోసం వెళ్తూ.. రైలులో మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలులో ప్రయాణిస్తున్న ఓ క్యాన్సర్ రోగి రైలులో మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణ కథనం ప్రకారం.. రాయచూర్ జిల్లా గుంజల్లికి చెందిన నారాయణ(61) క్యాన్సర్ రోగి కావడంతో బుధవారం హైదరాబాద్‌లోని కాచిగూడ నుంచి బెంగళూరుకు రైలులో వెళ్తుంటే మార్గమధ్యలో జడ్చర్ల దగ్గర నారాయణ ఆపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో అతని కుటుంబ సభ్యులు రైలులో నుంచి కిందకు దించి వైద్యుడితో పరీక్షించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే మృతుడికి క్యాన్సర్ ఉండటం వల్ల హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రి నుంచి బెంగళూర్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్తుంటే మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

కుటుంబ సమస్యలతో..

చిన్నంబావి: పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పెద్దదగడలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పెద్దదగడకు చెందిన కుమ్మరి శ్రీనివాసులు(38) తన వ్యక్తిగత, కుటుంబ ఇబ్బందుల నేపథ్యంలో మానసిక వేదనకు గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బుధవారం ఉదయం 10గంటల సమయంలో మరణించాడు. కాగా ఈ విషయం స్థానిక ఎస్‌ఐ వస్తంనాయక్ తమ దృష్టికి రాలేదని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన ముడావత్ శంకర్(45) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఉదయం ఇంట్లో కాలుజారి పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బుధవారం మృతుడి కుమారుడు ముడావత్ ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్

మహబూబ్‌నగర్ రూరల్: కోయిలకొండ మండలం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్, ఒక ట్రాక్టర్‌ను బుధవారం వీఆర్ఏలు పట్టుకొని అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చైతన్యకుమార్ వీఆర్ఏలతో కోయిలకొండ క్రాస్‌రోడ్ వద్ద కాపుకాచి ఉన్న వీఆర్ఏలు కోయిలకొండ నుంచి పట్టణంలోకి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్, టిప్పర్‌ను, అలాగే తిమ్మసానిపల్లిలోని పిల్లలమర్రి రోడ్డులో మరో ఫిల్టర్ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్ల యజమానులకు రూ.15వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆర్ఐ తెలిపారు. జరిమానా డబ్బులను చెల్లించకుండానే ట్రాక్టర్లు, టిప్పర్‌ను విడిపించుకుపోవాలనే యత్నంతో ఉన్న ఇసుక మాఫియా సంబంధిత అధికారులతో మంతనాలు జరపడం కొసమెరుపు.

ఏది అసలు.. ఏది నకిలీ..?

- కల్తీ సరుకులకు నిలయంగా మారిన జడ్చర్ల
- తరచూ పట్టుబడుతున్నప్పటికీ తేరుకోని అధికారులు


ఇటీవల పట్టుబడిన నకిలీ టీ పొడర్ (ఫైల్)

జడ్చర్ల టౌన్: వ్యాపారకేంద్రంగా పేరుగాంచిన బాదేపల్లి (జడ్చర్ల) నేడు కల్తీ సరుకులకు నిలయంగా మారుతుంది. గత ఏడాది జూలై నెలలో కల్తీ ఆశీర్వాద్ పైపులు, కొబ్బరినూనె, బంగారు ఆభరణాలు పట్టుబడగా, మూడురోజుల కిందట భారీ ఎత్తున టీ పొడర్ పట్టుబడింది. దీంతో ఎక్కడ, ఏ వస్తువు కల్తీ అవుతుందో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా తూనికలు కొలతల శాఖ అధికారులు ఏమాత్రం స్పందించకపోగా, విజిలెన్స్ అధికారులు మొక్కుబడిగా దాడులు నిర్వహిస్తున్నారు.

వరుస ఘటనలతో అయోమయం..

గ్లోబలైజేషన్ పేరుతో ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్లి వ్యాపారం చేయగలిగే సామర్థ్యం పెరగటంతో గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యాపారులు ఇక్కడకు తరలివచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. వీరితో పాటు హైదరాబాద్ సమీపంలోనే ఉండటంతో వస్తువులు, సరుకుల కల్తీకి ఎక్కువగా అవకాశం లభించినట్లయ్యింది. హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో ఆశీర్వాద్ పైప్‌లు నకిలీవి పట్టుబడి, తాను నకిలీ సరుకులు అమ్ముతున్నట్లు ట్రేడర్స్ నిర్వాహకుడు సైతం అంగీకరించాడు. అదే నెలలో పెద్దఎత్తున నకిలీ పారాచూట్ కొబ్బరినూనె పట్టుకున్నారు. బాదేపల్లి గంజ్ ఆవరణలో ఉన్న హోల్‌సేల్ దుకాణంలో ఈ నూనె పట్టుబడింది. ఇదే దుకాణంలో గతంలో రెడ్‌లేబుల్ టీ పొడర్, క్లినిక్‌ప్లస్ షాంపోలు పెద్దఎత్తున పట్టుబడ్డాయి. అదే నెలలో పట్టణంలోని ఓ బులియన్ దుకాణంలో బంగారు ఆభరణాలు కల్తీ చేయబడ్డాయని వెలుగు చూశాయి. ఇలా అన్ని వ్యాపారాల్లోనూ కల్తీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇక మమతనగర్‌లోని ఓ ఇంట్లో భారీగా నకిలీ టీ పొడర్ పట్టుబడింది. సదరు వ్యాపారిపై గతంలోనూ నకిలీ కేసులున్నాయి. అయినా మళ్లీ అదే వ్యాపారం చేస్తుండటం శోచనీయం.


నకిలీ టీ పొడర్ పరిశీలిస్తున్న అధికారి (ఫైల్)

మోసపోతున్న వినియోగదారుడు..

ప్రస్తుతం మార్కెట్‌లో విక్రయిస్తున్న వస్తువులు, సరుకుల్లో ఏది అసలు, ఏది నకిలీ అన్న సందేహాలు వినియోగదారుల్లో నెలకొన్నాయి. పారాచూట్ కొబ్బరినూనె, రెడ్‌లేబుల్ టీ పొడర్, క్లినిక్‌ప్లస్ షాంపులూ, టీ పొడర్ ఇలా ఒకటేమిటి అన్నింటా నకిలీ రాజ్యమేలుతుంది. బ్రాండ్ పేరుతో ఉండే నకిలీ వస్తువుల విక్రయాలపై దృష్టి సారించాల్సి ఉంది. ముఖ్యంగా పలు బ్రాండ్ వస్తువులు సైతం నకిలీవి లభ్యమవుతున్నాయి. కుర్‌కురే బదులుగా కుర్‌కుర్ అని, సంతూర్ బదులు సంతుర్ అని చిన్న అక్షరం తేడాతో వస్తువులు లభిస్తున్నాయి. ఇవన్నీ పట్టణంతో పాటు గ్రామాల్లోనూ విచ్చలవిడిగా విక్రయిస్తున్నా అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు కొరవడటంతో వినియోగదారుడు మోసపోతున్నాడు.

బేకరీలు, హోటళ్ల పరిస్థితిపై ఆందోళన..

మండల కేంద్రంలోని బేకరీలు, హోటళ్లలో తినుబండారాలు, ఆహారపదార్థాల నాణ్యతపైనా ఆందోళన నెలకొన్నది. వీటిపై తనిఖీలు పూర్తిగా కొరవడ్డాయి. రోజుల తరబడి నిల్వ ఉన్న కేక్‌లు, బిస్కెట్‌లు, రోజుల తరబడి ఫ్రిజ్‌లో పెట్టిన మాంసాహారం వండి వారుస్తున్నట్లు సందేహాలున్నాయి. అధికారులు ఇకనైనా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

కల్తీ అధికమైంది..



పట్టణంలోని అన్ని వస్తువుల్లోనూ కల్తీ అధికమైంది. అధికారుల తనిఖీలు లేకపోవటం వల్లే ఇలా జరుగుతుంది. ఫార్మాసెజ్ రావటం వల్ల ఇక్కడ వ్యాపారం పెరుగుతుంది. కొందరు ఆసరాగా చేసుకుని కల్తీకి పాల్పడుతున్నారు. లేబర్ అధికారులు, పోలీసులు, విజిలెన్స్, రెవెన్యూ, తూనికలు కొలతల శాఖ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం తనిఖీలు నిర్వహిస్తే కల్తీని అరికట్టే అవకాశం ఉంది.
– ప్రభు, జడ్చర్ల

నమ్మకస్తుల వద్దే కొనుగోలు చేయాలి..



నమ్మకస్తుల వద్ద మాత్రమే వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేయాలి. అందులోనూ బ్రాండెడ్ వస్తువులు ఒకటికి రెండుసార్లు పరిశీలించి తీసుకోవాలి. కొన్న ప్రతి వస్తువుకు రశీదు పొందాలి. అప్పుడే వినియోగదారులు కల్తీ వస్తువుల పట్ల జాగ్రత్తతో ఉండగలుగుతారు. కల్తీ వస్తువులు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.
– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, జడ్చర్ల

కలకలం రేపుతున్న 'న్యూడ్' వ్యవహారం

- కొనసాగుతున్న పోలీసుల విచారణ

జడ్చర్ల: హస్తరేఖలతో పాటు శరీరంపై ఉన్న పుట్టుమచ్చలు, శరీర కొలతలు లెక్కలేసి పూజలు చేస్తే కనక వర్షం కురుస్తుందన్న మాయగాళ్ల ఉచ్చులో పడిన పలువురు మహిళల ఉదంతం పట్టణంలో కలకలం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని లోతుగా విచారిస్తున్నారు. వారి దర్యాప్తులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా పేద కుటుంబాలు, ఆర్థిక ఇబ్బందులతో పడుతున్న చిరు వ్యాపారులనే ఈ ఊబిలోకి లాగుతున్నారు. అరచేతులు, పాదాలు, చాతి, నడుము, కాళ్ల తదితర భాగాల ఫొటోలు, వీడియోలు తీసి హైదరాబాద్‌లో ఉండే గురువుగా చెప్పుకొనే ఓ వ్యక్తికి పంపితే.. అతడు వీరిని ఆహ్వానించి పూజలు చేయిస్తారని తెలుస్తోంది. మాయమాటలు చెప్పి తీసిన న్యూడ్ ఫొటోలు, వీడియోలతో వీరు ఏం చేస్తున్నారన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. లైంగికంగా వేధిస్తున్నారా లేదా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా, దీని వెనుక ఎవరెవరు ఉన్నారు, ఎంతకాలం నుంచి సాగుతోంది, అసలు సూత్రధారులు ఎవరు అన్న కోణంలో విచారణ సాగుతున్నట్లు సమాచారం. వీరి ఉచ్చులో ఇప్పటి వరకు ఎంతమంది మహిళలు పడ్డారో కూడా తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో ఇద్దరు..

బాదేపల్లి పాతబజార్‌కు చెందిన ఓ వ్యక్తితో పాటు తిమ్మాజీపేట మండలానికి చెందిన మరోవ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారి మొబైల్ ఫోన్లలో ఉన్న న్యూడ్ ఫొటోలు, వీడియోలను సేకరించగా.. మరికొన్నింటిని నిందితులు తొలగించినట్లు సమాచారం. విచారణలో నిందితులు గురువుగా భావించే హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి పేరు వెల్లడించగా ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని.. త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

భక్తుల కొంగుబంగారం మంత్రాలమ్మ

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- తరలిరానున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు


ఆలయంలో కొలువుదీరిన మంత్రాలమ్మ

కోడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన మంత్రాలమ్మ షిడే బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. 1840లో వెలిసిన మంత్రాలమ్మ తమ కోర్కెలు తీర్చుతుందని ఇక్కడి భక్తుల నమ్మకం. పూర్వం జనుంపల్లికి చెందిన పర్లగొర్ల వంశస్తులు గొర్రెలను మేపేందుకు కర్నూల్ జిల్లా ఆత్మకూర్ మండలం కసుమ అనే అడవుల్లో వెళ్లారు. గొర్రెలు రోగాలతో మరణిస్తుండటంతో గొర్రెల కాపరికి అమ్మవారు ప్రత్యక్షమై జనుంపల్లి గ్రామ శివారులో ఆలయాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామస్తులతో చర్చించి అక్కడ అమ్మవారి ఆలయాన్ని నెలకొల్పారు. అప్పటి నుంచి ప్రతి యేటా శివరాత్రి అనంతరం అమ్మవారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా ఉంది. జనుంపల్లికి చెందిన చాలా మందికి మంత్రాలయ్య, మంత్రాలమ్మ అనే పేర్లు ఉండటం విశేషం. అమ్మవారికి తలచుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకమని అర్చకులు సూచించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ఇరు తెలుగు రాష్ట్రాల భక్తులు హాజరు కానున్నారు.


షిడే ఉత్సవానికి ముస్తాబైన ఆలయం

జాతరకు ఏర్పాట్లు పూర్తి..

గురువారం నిర్వహించే షిడే బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. షిడే ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నియంత్రణ

- జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్

రాజాపూర్: సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్లను నియంత్రించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని చెన్నవెల్లిలో రైతులు సాగుచేసిన వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాండం తొలుచు పురుగు పంటలను ఆశించిందని గుర్తించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నాటిన 15 నుంచి 40 రోజుల్లో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 4 కిలోలు పొడి ఇసుకతో కలిపి బురద పదునులో చల్లాలని సూచించారు. తాటాకు, ఉల్లికోడు, ఆకుముడత తెగుళ్ల నుంచి పంటలను ఎలా కాపాడుకోవాలో వివరించారు. ఏఓ, ఏఈఓల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నరేందర్ ఏఈఓలు మేఘనాథ్, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు కిష్టారెడ్డి, రైతులు రమేష్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, నర్సింహారెడ్డి, వీరస్వామి, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలు చేస్తున్న డీఏఓ వెంకటేష్

నష్టపోయిన మిరప పంటల పరిశీలన


మిరపపంటను పరిశీలిస్తున్న అధికారులు

మల్దకల్: మండలంలోని మేకలసోంపల్లిలో సాగుచేసి నష్టపోయిన మిరప పంటలను బుధవారం రాష్ట్ర ఉద్యానశాఖ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ పరిశీలించారు. మేకలసోంపల్లికి చెందిన రైతులు నకిలీ మిరప విత్తనాలతో పంటసాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. దీంతో రైతులు ఆందోళన చేశారు. శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి, రైతుల ద్వారా వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏడీఏ సంగీతలక్ష్మి, ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసాచారి, ఏఓ రాజశేఖర్, కంపెనీ నిర్వాహకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి


బందోబస్తు పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

కృష్ణ: నేషనల్ హైవే–167 కృష్ణానదిపై పురాతన వంతెన మరమ్మతుల నేపథ్యంలో బుధవారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు మరమ్మతులు జరగనున్న నేపథ్యంలో రాయచూర్‌కు వెళ్లే వాహనదారులు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని పేట డీఎస్పీ సత్యనారాయణ చెప్పారు. వాహనదారులు ముందస్తు సమాచారం మేరకు జడ్చర్ల, మహబూబ్‌నగర్, మరికల్ సబ్‌స్టేషన్‌ల నుంచి రాయచూర్‌కు వెళ్లే వాహనదారులకు అవగాహన నిమిత్తం మరికల్, మక్తల్, కృష్ణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అవగాహన కల్పించి, మరికల్ సబ్‌స్టేషన్ నుంచి ఎడమవైపు చిత్తనూర్, అమరచింత, జూరాల డ్యాం, గద్వాల, కేటీదొడ్డి, నందిన్నె మీదుగా రాయిచూర్‌కు మళ్లించామని తెలిపారు. ఇక్కడ పోలీస్ బందోబస్తును మూడు షిఫ్ట్‌ల ప్రకారం ఏర్పాటు చేసి, వాహనదారులను పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ సీతయ్య, కృష్ణ ఎస్‌ఐ విజయ్ భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

మద్దూరు: కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపల్లి మండలంలోని గోకుల్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోకుల్‌నగర్‌కు చెందిన బొంతలక్ష్మి (49) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయినా కడుపునొప్పి తగ్గకపోవడంతో నొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల 20న సమయంలో పురుగుల తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు గమనించి నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈనెల 21న మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి భర్త బొంతు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సాగునీటి కోసం రైతుల వాగ్వాదం

కేటీదొడ్డి: సాగునీటి కోసం రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా మైలగడ్డ, గంగన్‌పల్లి, పాతపాలెం, కొండాపురం, వెంకటాపురం, గువ్వలదిన్నె, నందిన్నె గ్రామాల్లోని పంటలకు సాగునీరందిస్తారు. వేసవి కావడంతో రిజర్వాయర్ నీటిమట్టం తగ్గి నీరందించేందుకు వారబంధి విధించారు. ఈ క్రమంలో 104వ ప్యాకేజీ కాల్వ ద్వారా వంతులవారీగా ఆయా గ్రామాలకు సాగునీరు అందించడానికి డిస్ట్రిబ్యూటర్లను ఏర్పాటు చేశారు. డి–7 కాల్వ ద్వారా కొండాపురం, పాతపాలెం, గంగన్‌పల్లి శివారులోని భూములకు సాగునీరందిల్సి ఉండగా, వారబంధి ఉండటంతో రైతులు వంతులవారీగా డిస్ట్రిబ్యూటర్ వాల్ తెరిచి సాగునీరు పెడుతున్నారు. కొండాపురం రైతులు డీ–7 వాల్ తెరవడానికి వెళ్లగా పాతపాలెం, గంగన్‌పల్లి, రైతులు అడ్డుకున్నారు. ఆయా గ్రామాల రైతుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు రాళ్లు విసిరినట్లు తెలిసింది. అధికారులు విధించిన వారబంధి ప్రకారం మంగళవారం కొండాపురం గ్రామానికి సాగునీరందాలి. గంగన్‌పల్లి రైతులు దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదని రైతులు అంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అధికారులు రైతులకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగిందని తెలిపారు.

ఎర్రకాల్వ గండ్లు పూడ్చరా?

- కాల్వలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు
- ముందుకుసాగని నీరు.. పలుచోట్ల గండ్లు
- మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు


ఎర్రకాల్వలో ఏపుగా పెరిగిన ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ గ్రామ సమీపంలోని చిన్న వాగు నుంచి అల్లీపూర్ గ్రామ చెరువు వరకు ఉన్న గొలుసుకట్టు చెరువుల ఎర్రకాల్వ మరమ్మతుకు నోచుకోవడం లేదు. కాల్వలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు ఏపుగా పెరిగి, నీరు ముందుకుసాగడం లేదు. పలుచోట్ల గండ్లు ఏర్పడ్డాయి. దీంతో ఏటా వర్షాకాలంలో వరద నీరంతా వృథా అవుతోంది. కాల్వ సమీపంలో రైతులు సాగు చేసిన పంటలు నీట మునుగుతున్నాయి. అంతేగాక చెరువులకు అంతంతమాత్రంగానే నీరు చేరుతోంది. దీంతో భూగర్భజలాలు అడుగంటి, యాసంగి పంటలకు చివరివరకు పూర్తిస్థాయిలో నీరు అందడంలేదు.

నిధులు దుర్వినియోగం..

చిన్నచింతకుంట, చిన్నవడ్డేమాన్, ఏదులాపూర్, మద్దూర్, అల్లీపూర్ గ్రామాల చెరువులకు, నీటిని నింపి సాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వాలు ఎర్రకాల్వను నిర్మించారు. ఏటా వేసవిలో కాల్వ మరమ్మతులు చేపట్టేవారు. దీనివల్ల వర్షాకాలంలో వరద నీరంతా ఇబ్బందిలేకుండా నేరుగా చెరువులకు చేరేది. రెండు పంటలకు పుష్కలంగా నీరందేది. 2016 సంవత్సరంలో కాల్వ మరమ్మతులకు తెలంగాణ ప్రభుత్వం రూ.45 లక్షలు మంజూరు చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు కాల్వ మరమ్మతులను నామమాత్రంగా చేపట్టి, నిధులను దుర్వినియోగం చేశారు. ఈ కారణంగా కాల్వలో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. చిన్నచింతకుంట గ్రామ సమీపంలోని ఉంద్యాల గ్రామ రహదారి పక్కన కుమ్మరి చంద్రన్న, హన్మంతు పొలాల వద్ద, రైస్‌మిల్ సమీపంలో ఆశన్న పొలంవద్ద, ఏదులాపూర్ గ్రామ సమీపంలో బాలగౌడ్, వెంకట్ రెడ్డి పొలాల సమీపంలో పలుచోట్లు గండ్లు ఏర్పడ్డాయి. పట్టించుకునే వారు లేకపోవడంతో ఏటా గండ్లు పడుతూనేఉన్నాయి. వరద నీరంతా రైతుల పంటపొలాలకు చేరి వందల ఎకరాలు నీట మునుగుతున్నాయి. దీనివల్ల రైతులు పెట్టిన పెట్టుబడి చేతికిరాక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని కాల్వ స్థిరంగా ఉండేలా, గండ్లకు అవకాశం లేకుండా కాంక్రీటుతో నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాల్వను బాగు చేయాలి..



వడ్డేమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట గొలుసుకట్టు చెరువుల ఎర్ర కాలువకు ముళ్లపొదలు ఏపుగా పెరిగి పలుచోట్ల గండ్లు ఏర్పడ్డాయి. దీంతో ప్రతి సంవత్సరం చెరువులకు నీరు చేరకుండా పంట పొలాలకు చేరి నష్టం వాటిల్లుతోంది. అధికారులు చర్యలు తీసుకుని కాల్వ మరమ్మతులు చేపట్టాలి.
– వెంకట్‌రెడ్డి, రైతు, ఏదులాపురం

నిధులు దుర్వినియోగం..



పెద్దవడ్డెమాన్ నుంచి అల్లీపూర్ గ్రామ చెరువు వరకు ఉన్న గొలుకట్టు ఎర్రకాల్వకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం అప్పట్లో నిధులు మంజూరు చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఆ పనులను నామమాత్రంగా చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారు. దీంతో కాల్వకు యథావిధిగా పలుచోట్ల గండ్లు ఏర్పడ్డాయి. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.
– మహిమూద్, మండల కోఆప్షన్ మెంబర్, చిన్నచింతకుంట

మరమ్మతులు చేయిస్తాం..

వడ్డేమాన్, చిన్నచింతకుంట ఎర్ర కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. వచ్చే నెలలో పనులు ప్రారంభించి త్వరలోనే పూర్తి చేస్తాం.
– గోపాలచారి, ఇరిగేషన్ డిప్యూటీఈఈ

వృద్ధురాలి చేతులు కట్టి ఆభరణాలు చోరీ

- పెద్దరేవల్లిలో ఘటన..
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ మహేష్

బాలానగర్: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి, ఇంట్లోకి తీసుకెళ్లి 7.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించి పరారయ్యారు. ఈ సంఘటన మండలంలోని పెద్దరేవల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్యాల పద్మమ్మ (75) భర్త మరణించడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేసి పంపింది. ఉదయం, సాయంత్రం పని మనిషి వచ్చి వెళ్తుంది. ఈ క్రమంలోనే ఇంట్లో ఒంటరిగా ఉండగా మంగళవారం రాత్రి 8గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి కళ్లకు గంతలు కట్టి, చేతులు కట్టేసి ఇంట్లోకి తీసుకెళ్లాడు. 4 తులాల బంగారు గాజులు, 2 తులాల పుస్తెలతాడు, 1 తులం కమ్మలు మాట్లీలు, అర తులం ముత్యాలదండ లాక్కుని పరారయ్యాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం బాధితురాలి ఇంటిని పరిశీలించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ సంఘటనపై డీఎస్పీ మహేష్ పెద్దరేవల్లి గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలానికి పరిశీలించి క్లూస్ టీం రప్పించారు. వారివెంట జడ్చర్ల టౌన్ సీఐ రమేష్, బాలానగర్ ఇన్‌చార్జ్ ఎస్సై నాగేశ్వర్‌రెడ్డి, రాజాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


విచారణ చేస్తున్న డీఎస్పీ మహేష్, సీఐ రమేష్ తదితరులు

ఈనాడు 'కొట్టు'కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ కట్టుకథనం

అవి పాత ఫొటోలని నిర్ధారించి.. ఉతికి ఆరేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులు

(సాక్షి, అమరావతి)

'ఈనాడు'పత్రిక ఎందుకింతలా దిగజారిపోతోంది? ఒక పార్టీపై బురద జల్లడానికి.. ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చడానికి... పోలీసుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయటానికి... మనుషుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి రెండేళ్ల కిందటి ఫొటోలు కూడా ఇవ్వాల్టివేనని అబద్ధాలు చెబుతూ ప్రచురించే స్థాయికి ఎందుకు పడిపోయింది? అసలిలాంటి పత్రికను ఎవరైనా నమ్మొచ్చా? చంద్రబాబును అధికార పీఠంపైకి తేవటం కోసం ఈ రాష్ట్రాన్ని ఏం చేసినా పర్వాలేదనుకునే రామోజీరావు మనస్తత్వాన్ని క్షమించవచ్చా?

'పట్టాభినీ కొట్టారు'అంటూ పతాక స్థాయిలో వేసిన శీర్షికలోనే కాదు... ఆ వార్తలో ప్రతి అక్షరం అబద్ధాలతో కూడిన కాలకూట విషమే. అసలు పట్టాభిని కొట్టనే లేదని పోలీసులు కోర్టులో చెబితే... దాన్ని వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ 'ఈనాడు'లో వార్తలేంటి? పైపెచ్చు... 'తీవ్రంగా కొట్టారు. అరచేతిపైనా, కాళ్లపైనా థర్డ్ డిగ్రీ ప్రయోగించార'ంటూ దుర్మార్గపు రాతలేంటి? ఆ రాతలన్నీ నిజమని నమ్మించటానికి వాటికి రుజువులుగా ఎప్పుడో రెండేళ్ల కిందట '2021 ఫిబ్రవరి 3న'తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ ఇపుడు వేసేసిన దౌర్భాగ్యపు పరిస్థితేంటి? అంటే... మీ దృష్టిలో మీ పాఠకులంతా వెర్రివాళ్లా రామోజీరావు గారూ? మీరు ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అదంతా ఒక చరిత్ర అని... 'సాక్షి'రాకముందు కొన్నాళ్లపాటు తెలుగు పత్రికారంగం ఎదుర్కొన్న సంధికాలమని ఇప్పటికీ తెలియటం లేదా? 'సాక్షి'ఆవిర్భవించిన నాటి నుంచీ మీ ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందని... వార్తలకు రెండోవైపున ఏమున్నదో కూడా జనం చూస్తున్నారని మరిచిపోయారా? ఇంటర్నెట్ వేదికగా వ్యక్తులే శక్తిమంతమైన మీడియాగా మారుతున్న ఈ రోజుల్లోనూ మీరు పచ్చి అబద్ధాలను పోగేస్తే నమ్మేస్తారని ఎలా అనుకుంటున్నారు? అసలు ఏనాటికైనా మారుతుందా 'ఈనాడు'?

'బీసీ'ల అభ్యున్నతి జనానికి చేరకుండా...

సోమవారం శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తూ... ఉన్న 18 స్థానాల్లో 14... అంటే ఏకంగా 68 శాతాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయిస్తూ కొత్త చరిత్రను లిఖించారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఎక్కడికక్కడ ముఖ్యమంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆనందంతో ర్యాలీలు చేశారు. ఇప్పటికే బీసీల్లో బలం పెంచుకున్న వై.ఎస్.జగన్‌కు... దీని వల్ల మరింత ఖ్యాతి వస్తుందని భావించిన తెలుగుదేశం, దాని మిత్ర మీడియా... వ్యూహం ప్రకారం అదేరోజున 'గన్నవరం'కుట్రకు తెరతీశాయి. తామే రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వటమే కాక... విజయవాడ నుంచి గన్నవరానికి వెళ్లి మరీ పట్టాభి సహా టీడీపీ నేతలు అక్కడి ఎమ్మెల్యే వంశీ అనుచరులతో ఘర్షణకు దిగారు. దాదాపు అన్ని ఛానెళ్లలోనూ బీసీలకు పట్టం కట్టిన వ్యవహారం రాకుండా... టీడీపీ చక్రం తిప్పింది. మంగళవారం నాడు 'ఈనాడు'లో ... గన్నవరంలో ప్రభుత్వమే దారుణాలకు పాల్పడ్డట్టుగా... పోలీసులే దౌర్జన్యం చేసినట్టుగా దారుణమైన కథనాలు వండివార్చేశారు. ఆ ఘర్షణల సందర్భంగా అరెస్టయిన పట్టాభిని పోలీసులు దారుణంగా కొట్టారంటూ బుధవారం దాన్ని కొనసాగించారు. అందుకు రుజువులుగా ఎప్పుడో 2021 ఫిబ్రవరి 3నాటి ఫొటోలను... ఇప్పటివేనంటూ వేసేశారు. అదీ జరిగిన కథ!!. ఔరా రామోజీ??

2021, ఫిబ్రవరి 3 'ఈనాడు'ఏం రాసిందంటే

'కర్రలు, రాడ్లతో పట్టాభిపై దాడి'అని 'ఈనాడు' బ్యానర్‌గా ప్రచురించిన వార్త ఇది. టీడీపీ నేత పట్టాభిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ 'ఈనాడు'హడావుడి చేసింది. విజయవాడలోని తన ఇంటి నుంచి కారులో వచ్చిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని... కారు అద్దాలు పగలగొట్టారని... పట్టాభిని కారు నుంచి బయటకులాగి... ఎడమ మోచేయి, ఎడమ మోకాలు, తొడపై ఇష్టారాజ్యంగా కొట్టారని వార్త ప్రచురించింది. తన భర్తకు ప్రాణహాని ఉందని పట్టాభి భార్య చందన ఆవేదన వ్యక్తం చేసినట్టు మరో వార్త ఇచ్చింది. పోలీసులు స్పందించి ఆ దాడిని మెడికో లీగల్ కేసుగా నమోదు చేస్తాం... ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తామంటే పట్టాభి వద్దన్నారని, దాంతో... పోలీసులు బలవంతంగా ఆయన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారని ఇంకో వార్త వేసింది. పట్టాభికి సంఘీభావంగా చంద్రబాబు హుటాహుటిన ఆయన నివాసానికి వచ్చి పరామర్శించటమే కాక... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చంపేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన వార్త కూడా వేసింది. ఇక పట్టాభి శరీరంపై గాయాలు... పట్టాభిపై దాడికి ఉపయోగించిన కర్ర... ధ్వంసమైన పట్టాభి కారు అద్దాలు...పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళుతుండటంతో విలపిస్తున్న పట్టాభి... పట్టాభిపై దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన తరువాత పోలీసులతో మాట్లాడుతున్న చంద్రబాబు... పట్టాభి శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న చంద్రబాబు... అంటూ పెద్దపెద్ద ఫొటోలతో విపరీతమైన హడావుడి చేసి... రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందనే భావన కలిగించాలని కుట్ర పన్నింది.

కానీ... ఆ కుట్ర బెడిసికొట్టింది

చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే ఆ దాడి గురించి ఫిర్యాదు చేయడానికి పట్టాభి ఇష్టపడలేదు. ఎవరిపైనయినా అనుమానం ఉందా? అంటే కూడా చెప్పలేదు. పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. పోలీసులు దర్యాప్తు జరపటానికే ఆయన ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? వాస్తవానికి పట్టాభికి సంబంధించిన వ్యక్తిగత రహస్యాలు, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కొందర్ని ఆయన చేసిన మోసాలు అప్పట్లో కథలుకథలుగా వినిపించాయి. తన వ్యక్తిగత రహస్యాలను బయట పడకుండా బ్లాక్‌మెయిలింగ్ చేసేందుకు పట్టాభే ఆ దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గాలు లోలోపల వ్యాఖ్యానించాయి కూడా. ఇవన్నీ బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఆయన దర్యాప్తునకు ఇష్టపడలేదు. దీంతో పట్టాభిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది.

అయినా... మనసు మారలేదు

అప్పట్లో చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టినా... 'ఈనాడు'మాత్రం మారలేదు. మళ్లీ బుధవారం నాడు పాత స్కీమునే పునరావృత్తం చేసింది. పట్టాభి అరికాళ్లు, తొడలపై దెబ్బలు అంటూ అలనాటి 5 ఫొటోలను మొదటి పేజీలో ప్రచురించింది. 'దేశమంతా ఐపీసీ చట్టం.. రాష్ట్రంలో వైసీపీ చట్టం' అంటూ మరో కథనంతో మొదటి, రెండు పేజీలను నింపేసింది. 'నా భర్త ప్రాణాలకు ముప్పు'అంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టుగా మరో వార్తను ఏకంగా అయిదు ఫొటోలతో ప్రచురించి 3వ పేజీని నింపేసింది. 'ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా'అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు మరో వార్త కూడా వేసింది. అంటే... రెండేళ్ల కిందటి ఘటనతో బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ ఆ స్కీమ్‌ను పునరావృత్తం చేశారు రామోజీరావు గారు. కాకపోతే మధ్యాహ్నానికల్లా సోషల్ మీడియాలోనే అందరూ నిజానిజాలు చెబుతూ 'ఈనాడు'వలువలు ఊడదీసేశారు. ఇప్పటికైనా రామోజీ మారతారా?

పట్టాభిని పోలీసులు కొట్టనే లేదు

వైద్య పరీక్షల్లో నిర్ధారణ

పట్టాభిని పోలీసులు కొట్టారన్న టీడీపీ ఆరోపణలు అవాస్తవమని స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో పట్టాభికి విజయవాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు రెండు సార్లు పరీక్షించి మరీ ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దాంతో తనను కొట్టారంటూ పట్టాభి ఆడిన డ్రామా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన అవాస్తవ ఆరోపణలు... రాష్ట్రంలో ఐపీసీ కాదు వైసీపీ అమలు అవుతోందంటూ ఈనాడు చేసిన దుష్ప్రచారం అంతా పక్కా ముందస్తు కుట్రేనన్నది స్పష్టమైంది.

పట్టాభిని కొట్టామనడం

అవాస్తవం

- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టీడీపీ నేత పట్టాభికి 14 రోజుల రిమాండ్

- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ధ్రువీకరణ
- ఈ మేరకు మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు

ఏపీలో 175 సీట్లలో బీఆర్‌ఎస్ పోటీ: తోట

గుంటూరు మెడికల్: రానున్న ఎన్నికల్లో 175 ఎమ్మెల్యే, 25 ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పోటీ చేయనుందని, ఏపీలో బీఆర్‌ఎస్ మూడో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఆవిర్భవిస్తున్నదని బీఆర్‌ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయనకు బీఆర్‌ఎస్ శ్రేణులు స్వాగతం పలికాయి. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం


తిరుమల: తిరుమలలోని గోకులం కార్యాలయంలో బుధవారం నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. తిరుమలలో ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు 150 శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నారు. మార్చి నుంచి 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, 400 టికెట్లు తిరుమలలోని గోకులం కార్యాలయంలో, 100 తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద భక్తులకు అందుబాటులో ఉంటాయి.

గోదారికి కరకట్టలతో కట్టడి!

నదికి ఇరువైపులా రూ.8వేల కోట్లతో 16కి.మీల మేర నిర్మాణం

- కుడి వైపున సంజీవరెడ్డిపాలెం– అమ్మగారిపల్లె వరకు
- ఎడమవైపున సుభాష్‌నగర్ కాలనీ–సున్నంభట్టి వరకు
- రూ.1629 కోట్లు, రూ.1587 కోట్లతో వేర్వేరు ప్రతిపాదనలు
- భూసేకరణకు రూ.230 కోట్ల––రూ.250 కోట్ల అంచనా వ్యయం
- రూ.25 కోట్లతో రెడ్డిసత్రం, కొత్త కాలనీల్లో రెండు పంప్‌హౌజ్‌లు
- వీటి ద్వారా వాగుల్లోని వరద నీరు గోదావరిలోకి ఎత్తిపోత
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు వరదల నుంచి రక్షణ కోసం గోదావరి నదికి ఇరు వైపులా 16 కి.మీల పొడవున కరకట్టలు నిర్మించాలని నిపుణుల కమిటీ ప్రతిపాదించింది. గోదావరికి కుడి వైపున బుర్గంపహాడ్ మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె వరకు, ఎడమవైపున భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీ నుంచి దుమ్ముగూడెం మండలం సున్నంభట్టి వరకు కొత్త కరకట్టలు నిర్మించడంతో పాటు ఇప్పటికే కరకట్టలు ఉన్న చోట వాటిని బలోపేతం చేయాలని సూచించింది. ఇందుకు రూ.1629 కోట్లు, రూ.1587 కోట్ల అంచనాలతో రెండు వేర్వేరు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాది జూలైలో గోదావరి నదికి వరదలు భీకరంగా పోటెత్తడంతో భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. జూలై 17న సీఎం కేసీఆర్ భద్రాచలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరదల నుంచి శాశ్వత పరిష్కారం కల్పించడానికి రూ.1000 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. నీటిపారుదల శాఖ ఈఎన్సీ(ఓ అండ్ ఎం) బి.నాగేంద్ర రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ వరదల నుంచి శాశ్వత పరిష్కారంపై అధ్యయనం జరిపి ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.



రూ.8వేల కోట్లతో కరకట్టలు !

వరద రక్షణ గోడల పనుల కోసం తొలి ప్రతిపాదన ప్రకారం భూసేకరణ నిర్వహిస్తే రూ.237 కోట్లు, మరో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.253.1 కోట్లు వ్యయం కానుందని కమిటీ అంచనా వేసింది. ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రతిపాదించింది. దాదాపు 230–250 ఎకరాల వరకు భూసేకరణ జరపాల్సి ఉండనుంది. కరకట్టల నిర్మాణానికి తొలి ప్రతిపాదన అనుసరిస్తే రూ.8329.75 కోట్లు, రెండో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.8443.9 కోట్లు కానుందని తెలిపింది. కరకట్టలతో పాటు 15 మైనర్ స్ట్రక్చర్లు, 2 మీడియం స్ట్రక్చర్లు, 6 మేజర్ స్ట్రక్చర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించింది.

పంపులతో గోదావరిలోకి వాగుల నీళ్లు ఎత్తిపోత

వరదల సమయంలో గోదావరిలో బ్యాక్‌వాటర్ వెనక్కి తన్నుతుండడంతో సమీపంలోని వాగుల ప్రవాహం అందులో కలవలేక ఎక్కడికక్కడే పేరుకుపోయి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా భద్రాచలంలోని రెడ్డిసత్రం, కొత్త కాలనీల వద్ద రూ.25 కోట్ల అంచనాలతో రెండు పంప్‌హౌజ్‌లు నిర్మించి వరద నీళ్లను ఎత్తి గోదావరిలో పోయాలని కమిటీ సూచించింది. బీటీ రోడ్లు, అప్రోచ్ రోడ్ల కోసం మరో రూ.6.75 కోట్లను ప్రతిపాదించింది.

కరకట్టలను నిర్మించాలని ఏపీని కోరనున్న ప్రభుత్వం...

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతోనే భద్రాచలం, పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించే పనులను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం/పోలవరం ప్రాజెక్టు అథారిటీని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కోరనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో ఏర్పడనున్న ముంపు సమస్యకు పరిష్కారం కల్పించాలని గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీతో పాటు కేంద్రాన్నీ కోరుతున్న విషయం తెలిసిందే. ముంపునకు గురవుతున్న భూముల సేకరణ లేదా కరకట్టలతో వాటికి రక్షణ కల్పించంలో ఏదైనా ఒక పనిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ/ఏపీ ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని తెలంగాణ అధికారులు పేర్కొంటున్నారు.

స్థిరంగా ఉల్లి ధరలు




దేవరకద్ర: స్థానిక మార్కెట్‌యార్డులో బుధవారం నిర్వహించిన బహిరంగవేలంలో గత వారం నమోదైన ఉల్లి ధరలే లభించాయి. ఉల్లి సీజన్ ప్రారంభం కావడంతో చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దఎత్తున అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌కు దాదాపు 2వేల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు బహిరంగ వేలం వేశారు. ఉల్లి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1200లు, కనిష్టంగా రూ.660ల వరకు ధరలు వచ్చాయి. కనిష్ట ధరలు కొంత వరకు పెరిగాయి. 45 కేజీల బస్తా ధర గరిష్టంగా రూ.600లు, కనిష్టంగా రూ.330ల వరకు విక్రయించారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో బుధవారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 143 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,030 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

కౌకుంట్లలో ఏపీ మంత్రి పెద్దిరెడ్డి



దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలం పుట్టపల్లికి చెందిన శ్రీనివాస్ 15 ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి వ్యక్తిగత డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. బుధవారం జరిగిన శ్రీనివాస్ వివాహానికి మంత్రితో పాటు ఆయన కుమారుడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట వైఎస్‌ఆర్‌సీపీ ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్ రవిప్రకాష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అయ్యప్ప సునీల్, ముకుందాచారి తదితరులు ఉన్నారు.

కనుల పండువగా అడివప్ప రథోత్సవం



తేరును లాగుతున్న భక్తులు

రాజోళి: హరోం హర.. పరమేశ్వరా అంటూ వేలాది మంది భక్తులు చేసిన పంచాక్షరి మంత్రం రాజోళి నలుమూలల్లో ధ్వనించింది. బుధవారం మండల కేంద్రంలో భ్రమరాంభ అడివేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి జయజయధ్వానాల మధ్య అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, గ్రామ పెద్దలు తేరుకు ప్రత్యేక పూజలు చేసి లాగారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చేసుకోకుండా ఎస్‌ఐ కుర్మయ్య, శ్రీనివాస్ నాయక్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం తదితరులు

గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



భోగ్ బండార్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, గిరిజనులు

కొల్లాపూర్: గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. బుధవారం పట్టణంలోని గిరిజన కమ్యూనిటీ భవనం వద్ద సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై భోగ్‌బండార్‌లో పాల్గొన్నారు. గిరిజనులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గిరిజనులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజనులకు రిజర్వేషన్లు పెంచడంతో పాటు, గిరిజన బంధు పథకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారన్నారు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దేనని తెలిపారు. ఉపాధి కోసం గిరిజనులు వలసలు వెళ్లే రోజులు మారిపోయాయని వెల్లడించారు. పోడుభూములకు పట్టాలు ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, గిరిజన నాయకులు శంకర్‌నాయక్, చంద్రశేఖర్‌నాయక్, పాండు నాయక్, బాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 16 నుంచి ప్లాట్ల వేలం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): అమిస్తాపూర్‌లోని సారిక, పోతులమడుగు టౌన్‌షిప్‌లో ఖాళీగా ఉన్న ఓపెన్ ప్లాట్లకు మార్చి 16 నుంచి 18వ తేదీ వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవి నాయక్ బుధవారం తెలిపారు. మార్చి 17, 18 తేదీల్లో జిల్లాకేంద్రంలోని బాదం సరోజినీదేవి ఆడిటోరియంలో ప్లాట్ల వేలం ఉంటుందన్నారు. సారిక టౌన్‌షిప్‌లో 60 గజాల నుంచి 266 గజాల విస్తీర్ణం ఉన్న ప్లాట్లు 96 అందుబాటులో ఉన్నాయని, గజం కనీస ధర రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పోతులమడుగులో ఉన్న 160 ప్లాట్లకు మార్చి 16, 17, 18 తేదీల్లో వేలం ఉంటుందని.. 140 గజాల నుంచి 400 గజాల విస్తీర్ణం ఉన్న ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. గజం ధర రూ. అయిదు వేల నుంచి రూ.5,500గా నిర్ణయించామన్నారు. ఈ రెండు సైట్లలోని ప్లాట్లకు సంబంధించి మార్చి 9న కలెక్టరేట్‌లో ప్రిబిడ్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలని, ఈ లేఅవుట్లు పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో తయారు చేయించినట్లు తెలిపారు. బ్రోచర్లను https://mahabubnagar.telangana.gov.in కానీ లేదా unda.gov.in./auctionr/triic.telangana.gov.in, rwafruh-a.teanfana.gov.in లో పొందుపర్చినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 08542–241165, 7675075365, 7993455775 సంప్రదించాలన్నారు.

బహిరంగ వేలం..

సారిక, పోతులమడుగు టౌన్‌షిప్‌లలో ఖాళీగా ఉన్న ఓపెన్‌ప్లాట్లకు మార్చి నెలలో బహిరంగ వేలం నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఈ అంశంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వేలం నిర్వహణకు జిల్లాకేంద్రంలోని బాదం సరోజినీదేవి ఆడిటోరియంలో ఏర్పాట్లు చేయాలని, మార్చి 7న ప్రీ బిడ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్, డీఆర్‌డీఓ యాదయ్య, కలెక్టరేట్ ఏఓ శంకర్, రాజీవ్‌స్వగృహ అధికారులు పాల్గొన్నారు.

రూ.13.82 లక్షల ఆదాయం

అలంపూర్: మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీజోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి వారి ఆలయ ఆదాయం రూ.13,82,380 వచ్చినట్లు ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. ఈనెల 17 నుంచి 21 వరకు ఐదు రోజులపాటు బాలబ్రహ్మేశ్వర స్వామి దేవాలయంలో అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అతి శీఘ్ర దర్శనం, ప్రసాదాలు, అన్నదాతల విరాళాలతో ఈ ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.



పరిమితికి మించి..



పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ పాఠశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు
- రెగ్యులర్, ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో పరీక్షలు
- గదులు సరిపోక నేల మీదే కూర్చుని పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో పాలమూరు యూనివర్సిటీ డిగ్రీ పరీక్షలతో పాటు డా. బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలు ఏకకాలంలో కొనసాగుతున్నాయి. అయితే బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో అధికారులు సామర్థ్యానికి మించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాకేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలతో పాటు ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల, వికాస్ డిగ్రీ కళాశాలలో పాలమూరు యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. కాగా జిల్లాకేంద్రం సమీపంలోని నెల్లికొండ వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల సామర్థ్యం 450 విద్యార్థులకే పరిమితం కాగా, ఇందులో 750 మందికి ఒకేసారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ డిగ్రీకి సంబంధించి బుధవారం కెమిస్ట్రీ సబ్జెక్టుకు మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అదే సమయంలో ఓపెన్ యూనివర్సిటీకి చెందిన మరో 400 మందికి ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. కళాశాల భవనంలో మొత్తం నాలుగు గదులు మాత్రమే ఉండగా విద్యార్థులు కూర్చునేందుకు స్థలం సరిపోక కళాశాల ప్రాంగణంలోనే విద్యార్థులను కిందనే కూర్చోబెట్టి పరీక్షలు రాయించారు. సంబంధిత అధికారులు విద్యార్థులకు సరైన సదుపాయాలను కల్పించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ స్పందిస్తూ.. కళాశాల సామర్థ్యానికి మించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో ప్రాంగణంలో సర్దుబాటు చేశామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాల

జీబీపీఎల్ టోర్నీ విజేత మంగంపేట్ తండా



బహుమతి అందుకుంటున్న యువకులు

మహమ్మదాబాద్: సేవాలాల్ జయంతిని పురస్కరించుకుని గోర్‌బంజారా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో మంగంపేట్ తండాకు మొదటి బహుమతి లభించింది. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చివరి మ్యాచ్‌లో మహమ్మదాబాద్ మండలం మంగంపేట్ తండా యువకులు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. రూ.50వేల నగదును జట్టుకు అందించారు. కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ చైర్మన్ బసిరెడ్డి, జిల్లా సేవాలాల్ కమిటీ అధ్యక్షుడు పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.